# రాధ

శ్రీమతి పవని భ్రమరాంబ

(గత సంచిక తరువాయి)

"పిచ్చితల్లి" అంది తల్లి కన్నవారి బాధ్యత తీర్చుకోడానికి. ఆడుది జన్మించగనే కన్నవారికి బాధ్యత ఏంటో? పుట్టిన తరువాత పూరిమేయరుగదా. వీరికింత విశ్రాంతి ఎందుకు.

రోజులు గడుస్తున్నాయి. రాధకు పదునాల్గవ సంవత్సరం ప్రారంభమయింది. వివాహం స్థిరపడలేదు. విద్యానిమగ్నమైన రాధకీ చింతయేలేదు.

సాంబమూర్తికి రాధ వివాహచింత వ్యాధిరూపంగా బాధించటం మొదలెట్టింది. "ఈడు వచ్చిన బాలిక నింటిలో నుంచుకొనుట"యను మాట తలపుకు వచ్చినప్పుడతని హృదయము ద్రవీభూతమగుచుండెను.

దినములు గడచుకొలది సాంబమూర్తి వ్యాధి వృద్ధియయ్యెను. అప్పుడుభర్త చేరువను కూర్చుండి ఎల్లప్పుడు విలపించుచుండును. రాధ ఈ అనోమయమునకు కారణమూహింపజాలక కృశించిపోయెను.

సంస్కృత పఠనము మానివైచెను. ఆమెకీ కల్లోలమున విద్యాసక్తికి తావులేకపోయెను. ఎల్లప్పుడు ఇంటియందుండి తల్లిదండ్రులకు ధైర్యము కూర్చుటయే ఆమె పని.

ఆ దంపతులకు వివాహ విషయమున ధైర్యము నానాటికడుగంటెను. విషమ పరిస్థితులకు లోనగుదుమేమోయను తలపు వారి నందరిని బాధింపసాగెను.

సాంబమూర్తి మరణించినాడు. తల్లి, రాధల దుఃఖమునకు మేరయేలేదు. చేయవలసిన కార్యక్రమములు మామూలుగానే జరిగినవి. ఇరుగు పొరుగువారి ఓదార్పులతో పదిమాసములు గడచినవి.

రాధ ... పూర్ణయవ్వనవతి. ఇప్పుడామె విద్యాభ్యాసము మానివేసినది. కలిగిన విద్యతోనే తల్లికి తగు సహాయకారిగానుండినది.

క్రమంగా కొంత మనోధైర్యాన్ని చేకూర్చుకొంది. రాధకు ఐదారుమాసములలో వివాహము జరిగించవలెనను దృఢసంకల్పంతో పర్యటనకు బయలుదేరింది "వరుని" కొరకు ..

ఆ వూరిలో గొప్ప పండితుడు ఆలయ పీఠాధిపతి, ప్రస్తుతములేకపోయినా ఇంకొక ఐదారు మాసములలో తండ్రి తాతలవలన

సంక్రమించినదగు పీఠాధిపత్యమును నిర్వహించును. ఇరువదినాల్గేండ్ల వయస్సులో నున్నాడు. ఏకాకి అని విని వెంబడే దేవి అచ్చటికి ప్రయాణంచేసింది. పండితుడు, పీఠాధిపతి కాబోవువాడు, యువకుడు నయిన మాధవునితోనే మాట్లాడినది. ముహూర్త నిశ్చయంకూడా జరిగింది. ...

రాధా మాధవుల వివాహం ఆలయం లోనే అతివైభవంగా జరిగింది. రాధను అప్పగింతలతో విడువలేక విడచి స్వగ్రామం చేరుకుంది. ఇప్పుడు రాధా మాధవులు అన్యోన్యానురాగులు ప్రేమికులు, పరస్పరప్రేమానుబద్ధులై కాలము గడపుచున్నారు.

మాధవుని తల్లిదండ్రులు బాల్యంలోనే మరణించిన కారణంచే ఆ దంపతులొక్కరే ఒకకుటీరంలో నివాసమేర్పరచుకొనిరి. ఒకశుభ ముహూర్తమున మాధవుడు ఆలయపీఠాధిపత్యమును స్వీకరించెను. రాధ భర్త సాన్నిధ్యంలో ఆ పరమేశ్వరుడు ప్రసాదించిన పవిత్రమహోత్తరసందేశాన్ని పొందగల్గెను.

ప్రేమానురాగ పూరితమైన రాధ భర్తతోడిదే లోకమని కాలముపుచ్చుచు నిష్కల్మషమైన హృదయములో పతి సేవ చేయుచుండెను. ఈలా ఎన్నాళ్లో గడవలేదు.

ఒకసంవత్సరం కాలగర్భంలో కలసింది. రాధలో మార్పేమీలేదు. కాని భర్తలోని చీకాకు చిరాకులను గమనించింది. తాత్కాలికపు విసుపుదల అని సరిపుచ్చుకొనుచువచ్చినది ఈ నవ యువ భర్తల విషయమెరుగని రాధ. కాని ఈ చిరాకు నానాటికి వృద్ధికాజొచ్చెను. రాధను ఏవగించుకొని కోపగించి కొట్టుట ప్రారంభించెను. రాధ మాత్రము ''విసుపుదలవలన'' యని సరిపుచ్చుకొన సాగెను.

ఆ వూరిలోని శివాలయం మాధవుని పితరులు నిర్మించినది. వారేదాని పీఠాధిపతులుగను, మ తా ధి కా రు లు గను, ధర్మకర్తలుగనుండుచూవచ్చిరి. ఆ తండ్రి తాతల తదనంతరం సంక్రమించిన ధర్మకర్త పీఠాధిపతి పదవులను ప్రస్తుతము మాధవుడు నిర్వహించుచుండెను.

దేవాలయమునకు సంబంధించిన వస్తు పరిచారకబృందంలో దేవదాసియొక్కతె. ఈ దేవదాసిపొందవలసిన డబ్బు ధర్మకర్త వసూలు చేసిన దేవుని ఇనాములో పొందును. ఆ దేవాలయపు దేవదాసి ఈశ్వరి పదునెనిమిది సంవత్సరముల వయస్సు ... ... అనుదినము రెండు మార్లు దేవునియొద్ద నృత్యము సల్పిపోవుట నియమము.

కాలమునకు విలువ ఎక్కడిది! రాధా మాధవుల వివాహంజరిగి సంవత్సరందాటి నది. మాధవుని యందలి మార్పు నా నాటికి వృద్ధియై విషమించినది. ఇపుటింటి లోనొకనిముసమైన నుండడు. ఆలయ మందే రాత్రింబవళ్లు కాలము పుచ్చు చుండెను. అతనిలో ఇప్పుడు రాధకు తావు కనుపించదు. అంతట దేవదాసి ఈశ్వరి ప్రతిబింబిస్తున్నది.

ఆలయంలో మునుపటి వేదఘోష లేదు. పూజలులేవు ... కాంతివంతంగా వుండే ఆలయ్యం కళావిహీనమయినది.

ఈశ్వరీ వీణానాదంలో ధర్మకర్త సరస సల్లాపాలతోనిండిపోయింది. శిలారూపంలో ఉన్న ఈశ్వరుడు ఈ అన్యాయానికి చలించలేదు...... విగ్రహపార్వతి కండ్లు తెరిచియుండికూడా లాభంలేదు ... రాధ ఇంటిలో ఏకాకి. ఐదారువారములుగడచి నవి. .... భర్త ఇల్లు చేరలేదు. ఇంకను ఆమె సత్యాన్వేషణతోనే జీవితంగడపదల చింది. భర్తనేమియు ఆక్షేపింపలేదు. భర్తయందలి ప్రేమ ఏమాత్రము తరుగ లేదు కాని ... భర్తనడవడిని గుర్తించి కృశించిపోవసాగింది.

రాధ తల్లి మరణించింది. రాధ రెండశ్రువులురాల్చి మాతృప్రేమ వెళ్ల బోసింది.

ఈశ్వరీ మాధవులు వివాహమాడుటకు నిశ్చయించుకున్నారనే వార్త వూరంతయు మారు మ్రోగింది. వూరి పెద్దలందరు తగు విధమున బుద్ధులుగరిపారు. ఏంలాభం...

రాధ ... కుళ్లికృశించి పోయింది. రాత్రింబవళ్లు ఏకదీక్షగా ఆలోచిస్తున్నది. కర్తవ్యం? ఏమిటో తల్లిదండ్రులు వారి బాధ్యత తీర్చుకొని పరలోకగతులైరి. పరి పూర్ణవిశ్వాసంతో ప్రేమించిన భర్త సత్కారం ... ఆమెను మరింతకలవరపెట్ట సాగినయి. ఈశ్వరీమాధవులు ఎచ్చటికో వెళ్లిపోయినారను వార్త తెల్లవారుసరికి గ్రామమంతయుప్రాకినది. రాధకు మనో వైకల్యం కలిగింది. కారుచీకటులావె నావహించినట్లుంది ..

బిరబిర ఆలయ ప్రాంగణానికి పరు వెత్తింది. లోపలికి వెళ్ళిచూచింది. పార్వతీ పరమేశ్వరులు - ఆ పురాణదంపతులు .. శిలారూపంలో నిశ్చలులైయున్నారు .... బయటకు వచ్చింది పిచ్చిగా కేకలువేస్తూ.

ఎదురుగానున్న జన సమూహంలోకి పరుగెత్తింది. వారీమెనుగమనించలేదు.... ధర్మకర్త పదవికొరకు పోరాడుకుంటు న్నారు ... ఈ ప్రపంచంలో ఎవరిజిజ్ఞాస వారిది. రాధ సమూహాన్ని, ఒక సారి దీక్షగాపరిశీలించింది ... అరచుకొంటూ పరువుతీసింది వూరిబయటకు ... ...

ఇప్పటికి ఇరువది సంవత్సరములు గడచినవి "నాయనా ఇదీ ఆమెవిషాదచరిత్ర ఈ రాధయే ఆ రాధ'' నిట్టూరుస్తాడు గురువు. ''తొలికోడికూయుచున్నది మనము కుటీరము చేరుదము'' అంటూ లేచాడు గురువు.

కన్నీళ్లు పైగుడ్డతో తుడుచుకుంటూ లేచాడు బాలుడు. ఆ యిసుకబాటల్లో నడకసాగించారు. దూరాన్నుండి ఒక శ్లోకం...

హేగోపాలక హేకృపాజలనిధే హేసింధు
కన్యాపతే.....

ఆ నూతనకంఠం వీరిని సమీపిస్తుంటుంది.

''బాబా ఈశ్వరీ మాధవులేమైనారు'' ప్రశ్నిస్తాడు బాలుడు

''ఈశ్వరి మాధవుని వివాహమాడుదునని మోసగించి మరొకనితో ఎచ్చటికో వెళ్ళిపోయింది. మాధవుడు పశ్చాత్తాపహృదయుడై ఇల్లు చేరుతాడు. కాని ఏముందీ ... కుటీరం పాడుపడి కూలిపోయింది ... ప్రేమహృదయ రాధ కనుపించలేదు .... వెళ్లిపోయింది ఎచ్చటికో... ఈ దృశ్యం అతనిని మరింతకలవరపెట్టింది ... మాధవుడిప్పుడొకయోగి'' ... ఆవ్యక్తి వీరిని సమీపించాడు. ''అతడే మాధవుడు'' అన్నాడు గురువు. అతడు వారినిదాటిపోయినాడు.

వేగుచుక్క పొడిచింది. కాలవైపరీత్యానికి కలవరపడుచు ఆ ఇసుక బాటల్లో మసకచీకటిలో ఆ గురు శిష్యులిరువురు అదృశ్యమయ్యారు...




అన్ని
నొప్పులకు

అమృతాంజనము

కడుపునొప్పి, నోట నీరూరుట,
త్రేపులు, వాంతులు, మలబద్ధకము
లాంటి అజీర్ణ లక్షణములకు

కేసరి గారి

ఆదిత్య లవణము

దివ్య ఔషధము

వెల రు. 1-75 న.పై.

కేసరి కుటీరం ప్రైవేట్ లిమిటెడ్
మద్రాసు 14.